క్లుప్తంగా

హైవేపై సీసీ కెమెరాల ఏర్పాటు



పోలీస్ స్టేషన్‌లోని కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల రికార్డు దృశ్యాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మహేష్

బొండపల్లి: మండల పరిధిలోని జాతీయ రహదారి–26పై బోడసింగిపేట నుంచి గొట్లాంలోని బైపాస్ రోడ్డు వరకు 46 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్ఐ యు.మహేష్ ఆదివారం తెలిపారు. హైవేపై జరిగే ప్రమాదాల వివరాలు సేకరించ డానికి వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం వాటిని పర్యవేక్షిస్తామని చెప్పారు.

అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని శీతలమాత(సంతాన లక్ష్మి) అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు ప్రారంభించారు. అమ్మవారి 41వ జాతర మహోత్సవాలు ముగియడంతో ఆనవాయితీ ప్రకారం ఆలయ కమిటీ, నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు. కమిటీ ఆహ్వానం మేరకు ఆలయానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు గవిడి సురేష్, కొసిరెడ్డి రమణ, ఎల్.ప్రభాత్, ఆలయ కమిటీ ప్రతినిధులు కంద్యాన వసంత్, రాము, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంద్రాంలో నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

బొండపల్లి: మండలంలోని వేంద్రాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల లో ఆగ్రామ రామదండు యువత ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు.విజయనగరానికి చెందిన శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆప్తాలమిస్టులు పి.మౌనిక, ఎం.అనురాధ 110మందికి నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 26 మందికి శస్త్రచికిత్సలు అవసరమని, త్వరలో వీరికి తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు ఆ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పి.సురేష్ తెలిపారు. స్థానిక పాఠశాల హెచ్‌ఎం దొర, రామదండు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూడికతీత పనుల ప్రారంభం



పూజలు చేసి పూడికతీత పనులను ప్రారంభిస్తున్న సాగునీటి సంఘం చైర్మన్ సత్యనారాయణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామంలో నల్ల చెరువుకు వరద నీరు వెళ్లే కాలువలో పూడికతీత పనులను సాగునీటి సంఘం చైర్మన్ గంగుపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.కోనూరు నుంచి అర్తమూరు గ్రామంలోని నల్ల చెరువు వరకు సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో జేసీబీతో పూడికతీత పనులు చేపట్టనున్నామని ఆయన చెప్పారు. ఈ పనులు పూర్తయితే వర్షపు నీరు చెరువులోకి ప్రవహించేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు, మాజీ సర్పంచ్ మహంతి రమణమూర్తి, వైస్ చైర్మన్ మహంతి సూర్యనారాయణ, స్థానిక నాయకులు చిత్తుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆర్‌ఓబీ పనులు



క్రేన్ల సహాయంతో పిల్లర్స్‌పైకి పియర్స్‌ను ఎక్కిస్తున్న దృశ్యం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం జాతీయ రహదారిలో ఆర్‌ఓబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్‌ఓబీ పనులు ముందుకుసాగకపోవడంపై పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పందించి, సంబంధిత కాంట్రాక్టర్‌కు ఇటీవల నోటీసులు జారీ చేశారు. దీంతో పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే 84 శాతం పనులు పూర్తికాగా మిగాతా పనులు పూర్తి చేయడంలో భాగంగా ఆదివారం వంతెన పిల్లర్లపై పియర్స్‌ను భారీక్రేన్ల సహాయంతో అమర్చారు. సోమవారం నాటికి ఈ పనులు పూర్తవుతాయని జేఈ విశాల్ గుప్త చెప్పారు.వంతెన పనుల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పెదమానాపురం ఎస్ఐ జయంతి చర్యలు తీసుకున్నారు.

- రైతులకు దక్కని మద్దతు ధర
- ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225
- పెరిగిన పెట్టుబడుల దృష్ట్యా రూ.3 వేలకు పెంచాలని కోరుతున్న రైతులు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్



శ్రీరంగరాజపురంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

గిట్టుబాటు కాని మొక్కజొన్నసాగు



శ్రీరంగరాజపురం గ్రామంలో మొక్కజొన్న కండెలను వలుస్తున్న మహిళలు

గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో రబీ మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
గజపతినగరం	1,500
దత్తిరాజేరు	550
మెంటాడ	340
బొండపల్లి	130

గజపతినగరం: ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు.శ్రమ,పెట్టుబడికి తగిన ఫలితం దక్కకపో తుండడంతో రబీ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతుల శ్రమను పక్కనపెట్టి.. దుక్కులు నుంచి విత్తనం నాటి పంటకోతకు వచ్చే వరకు అయ్యే సస్యరక్షణ ఖర్చులను లెక్కగడితే మిగిలేది ఏమీ ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,225 మద్ద తు ధర ప్రకటించింది. ప్రభుత్వం మద్దతు ధర అయితే ప్రకటించింది కానీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇదే అవకాశంగా భావించిన దళారులు తమకు నచ్చిన ధరకు పంటను కొనుగోలు చేస్తూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. గత్యంతరం లేక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకే రైతులు పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఈ ఏడాది దిగుబడులు కూడా ఆశా జనకంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోఎకరానికి 35 నుంచి సుమారు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్లు దాటేలా లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,225 సరిపోదని, రూ.3 వేల నుంచి రూ.3,300కు పెంచితే తప్ప మొక్కజొన్న సాగు గిట్టుబాటుకాదని అన్నదాతలు అంటున్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

2,520 ఎకరాల్లో పంట సాగు

గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో రబి సీజన్‌కు సంబంధించి 2,520 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పంటకోత పనులు పూర్తయ్యి, విక్రయాలు ప్రారంభమయ్యాయి. గజపతినగరం మండలంలోని శ్రీరంగరాజపురం, కాలంరాజుపేట,పిడిశీల,సీతారామపురం,ఎం.గుమడాం, దత్తిరాజేరు మండలంలోని ఎం.లింగాలవలస, గడసాం, పోరలి, దాసుపేట, సరాయివలస, మెంటాడ మండలంలోని పెదమేడపల్లి, పెదశామలాపల్లి, పోరాం, ఆంద్ర, జక్కువ, బొండపల్లి మండలంలోని ముద్దూరు, గరుగుబిల్లి తదితర గ్రామాల్లో పంటకోతలు, పంట విక్రయాలు ప్రారంభయ్యాయి.

కనీసం రూ.3 వేలు మద్దతు ధర ప్రకటించాలి



గత కొన్ని సంవత్సరాలుగా మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నాను. ఎరువులు, పురుగు మందులు, ఇతర పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించి మద్దతు ధర ఏమాత్రం సరిపోదు. పెట్టుబడి ఖర్చులను దృష్టిలో ఉంచుకుని క్వింటాల్‌కు కనీసం రూ.3 వేలు మద్దతు ధర చెల్లిస్తూ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది.

– బి.గోపాలరావు, రైతు, పిడిశీల గ్రామం, గజపతినగరం మండలం



సీతారామపురంలో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న కండెలు

సర్పంచ్‌లకు చెప్పకుండా పనులు చేయడమేంటి..?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు



అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

గజపతినగరం రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మంజూరైన పనుల గురించి తమకు తెలియజేయకుండా, పంచాయతీ తీర్మానాలు లేకుండా కూటమి నాయకులతో చేయించడ మేంటని మధుపా డ, కాలంరాజుపేట, పి.ఎస్.ఆర్.పురం గ్రామాల సర్పంచ్‌లు కె.పైడుపునాయుడు, గేదెల ఈశ్వరరావు, కామునాయుడు మండల అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతినివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు మాట్లా డుతూ ప్రజలతో ఎన్నుకోబడిన గ్రామ ప్రథమ పౌరులమైన తమకు ప్రభుత్వ కార్యక్రమాలు, పనుల గురించి అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తమకు చెప్పకుండా కూటమి నాయ కులతో కలిసి అధికారులు కొన్ని పనులు చేస్తున్నారని, ఇదేనా సర్పంచ్‌లకు మీరిచ్చే విలువ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ జేఈ అప్పలనాయుడు, ఎంపీడీఓ కల్యాణి స్పందిస్తూ ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటుచేసి చర్చించిన తర్వాతే పనులు చేపడతామని చెప్పారు. అధికారుల సమాధానానికి సర్పంచ్‌లు సంతృప్తి చెందలేదు. కొందరు సర్పంచ్‌లు నిలదీతలు కొనసాగించడంతో అధికారులు మౌనం వహించి, ఇతర అంశాలపై ముందుకు వెళ్లారు. గ్రామ సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, అడిగితే సర్వేల కోసమని బయటకు వెళ్లామని చెబుతున్నారని కాలంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందిస్తూ సర్వేలు జరుగుతున్న మాట వాస్తవమేనని, కొంతమంది సిబ్బందిని సచివాలయంలో అందుబాటులో ఉంచు తామని తెలిపారు.సమావేశానికి తహసీల్దార్ గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఆయన తరచూ ఇలాగే చేస్తున్నారని, భూసమస్యలను చెప్పుకునే అవకాశం లేకుండా చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ ఇకపై జరిగే సర్వసభ్యసమావేశాలకు తహసీల్దార్ హాజరయ్యేలా చూస్తామని చెప్పారు. జెడ్పీటీసీ గార తవుడు, వైస్ ఎంపీపీలు కర్రి శ్రీదేవి, దమయంతి, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్, ఐసీడీఎస్ పీఓ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగు తీస్తున్న ఎడ్లు



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గ్రామంలో ఎర్నిమాంబ అమ్మవారి తీర్థం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీ లు ఉత్కంఠగా సాగాయి. విశాఖపట్నం,అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 12 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా...వావిలపాడు గ్రామానికి చెందిన మరిడి మాంబ ఎడ్లు ప్రథమ స్థానంలో, దేవరాపల్లికి చెందిన వారాది భరద్వాజ్ ఎడ్లు ద్వితీయస్థానంలో, వల్లంపూడికి చెందిన శ్రీసిద్ధివినాయక ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు ప్రకటించిన నగదు బహుమతులను అతిథులు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు అందజేశారు.తీర్థం నేపథ్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భోజింకి ఎర్నాయుడు, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ భగవద్గీత



ప్రతి భారతీయుడు చదవాల్సిన, ప్రతీ ఇంట ఉండాల్సిన పుస్తకం భగవద్గీత అని ఎస్.కోట కు చెందిన మోక్షవిద్య యోగమందిర్ సంస్థ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు అన్నారు. ఎస్.కోట పట్టణంలోని రైల్వేక్వార్టర్స్‌లో ఆదివారం భగవద్గీతపై ఇంటింట ప్రచారం నిర్వహించంతో పాటు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు, భగవద్గీత ప్రతులు కావాల్సిన వారు 99893 08781, 98667 57311నంబర్ల సంప్రదించాలని సూచించారు. మోక్షవిద్య యోగమందిర్ సంస్థ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు, సలహాదారు టి.అప్పా రావు, చంద్రశేఖర్, కె.శ్రీహరి, ప్రసాద్, జి.సంతోష్ పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

- మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు ఏకరువు పెట్టిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



సమస్యల పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎంపీపీ మీసాల విజయలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్వసభ్య సమావేశాల్లో ప్రస్తావించడమే మిగులుతోంది తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని, అలాంట ప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకని మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను ప్రశ్నించారు.గరివిడి మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా శాఖల వారీగా సమీక్షించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యు లు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించేటప్పుడు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి తమకు సమాచా రం ఇవ్వడం లేదని, తాము ఉన్నది కేవలం మీరు చెప్పినట్లు సంతకాలు చేయడానికేనా అని నిలదీశారు.ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం స్పందిస్తూ గ్రామాల్లో అధికారులు పర్యటించేటప్పుడు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ నవీన్ మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.3.5 లక్షలు అందిస్తుం దని చెప్పగా...వైస్ ఎంపీపీ జి.రామకృష్ణ రాజు, అర్తమూరు సర్పంచ్ పొన్నాడ కుమార్, కొండపాలెం ఎంపీటీసీ సభ్యుడు యడ్ల సూర్యారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై నిర్మించుకోలేని వారికి కూడా ఈ పథకం వర్తింపచేయాలని కోరారు. ఏఈ స్పందిస్తూ లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన వారికి సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదని, ప్రభుత్వం ఆదేశాలిస్తే పరిశీలి స్తామని తెలిపారు. అర్తమూరు సర్పంచ్ పొన్నాడ కుమార్ మాట్లాడుతూ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు గ్రామాల్లోకి వచ్చి పరిశీలించి ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. రేగటి పంచాయతీ ఎంపీటీసీ కడుమల రాంబాబు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో ఇప్పటి వరకు కనీసం పారిశుద్ధ్య పనులు కూడా చేయలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు.ఇది వరకే పంచాయ తీలో డయేరియా విజృంభించిందని గుర్తు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులుగా తాము పారిశుద్ధ్య పనులు చేయిస్తామంటే అధికార పార్టీ వారు చేయని వ్వడం లేదని,అలాగని వారూ చేయడం లేదని వివరించారు. దీనికి ఎంపీపీ స్పందిస్తూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని, మరోసారి ఇలాంటి ఫిర్యాదు లు రాకుండా చూడాలని ఈఓపీఆర్డీ పుష్పాంజలికి సూచించారు. గరివిడి–గర్భాం జంక్షన్ వద్ద నిత్యం భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోడ్డు గోతులు తేలి, దుమ్ము,ధూళితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ యడ్ల సూర్యారావు సమస్యను సభ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు స్పందించి సంబంధిత అధికారులతో సమస్యపై చర్చించారు.గరివిడి మండలంలోని కోనూరు–చీపురుపల్లి మండలంలోని జి.ములగాం గ్రామాల మధ్య రోడ్డు, వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ.7 కోట్లు మంజూరు చేసిందని, పనులు ప్రారంభించేలా చూడాలని సర్పంచ్ బూడి శ్రీరాములనాయుడు అధికారులను కోరారు. అలాగే కోనూరు రోడ్డు నుంచి బీసీల శ్మశానవాటికకు ఉపాధి హామీ నిధులు రూ.23లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణంలో నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, అధికారులు పరిశీలించాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో శతశాతం అక్షరాస్యత



బొండపల్లి: బిల్లలవలసలో పరీక్షరాస్తున్న మహిళలు



చీపురుపల్లి: వంగపల్లిపేట పాఠశాలలో ఉల్లాస్ పరీక్షలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు దొరబాబు



గంట్యాడ: రామభద్రపురంలో పరీక్ష రాస్తున్న వయోజన మహిళలు



గజపతినగరం: దావాలపేటలో పరీక్షను పరిశీలిస్తున్న స్త్రీనిధి మేనేజర్ అరుణ



గజపతినగరం: పురిటిపెంట అంగన్‌వాడీ కేంద్రం -3లో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కల్యాణి



దత్తిరాజేరు: మరడాంలో పరీక్షలను పరిశీలిస్తున్న వెలుగు ఏపీఎం అప్పలనాయుడు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కొండపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తదితరులు



గుర్ల: గుర్లలో పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ శేషుబాబు



మెరకముడిదాం: పరీక్ష రాస్తున్న మహిళలు

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది శతశాతం అక్షరాస్యత సాధించడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని రాష్ట్ర పరిశీలకులు కె.దొరబాబు, ఎంపీడీఓలు, వెలుగు ఏపీఎంలు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. డ్వాక్రా సంఘాల్లోని అక్షరాస్యులు, ఆ సంఘాల వీఓఏలను వలంటీర్లుగా నియమించి నిరక్షరాస్యులైన సభ్యులకు 'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా కొద్ది రోజులుగా అక్షరాలు చదవడం, రాయడం నేర్పించారు. వీరికి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో నిర్వహించిన పరీక్షకు మంచి స్పందన వచ్చింది. వేలాది మంది మహిళలు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను అధికారులు పరిశీలించారు.

– సాక్షినెట్‌వర్క్

నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్ ఆ దివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి



ఇంటింట ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయినులు

మెరకముడిదాం: అన్ని సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని సింగవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినులు తల్లిదండ్రులను కోరారు. హెచ్‌ఎం ఆర్.ప్రశాంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులు రోజాకుమారి, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త గ్రామంలోప్రచారం చేశారు. అయిదేళ్లు నిండిన పిల్లలను గ్రామంలోని ప్రభు త్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.